జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 4-2-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 582 పేజీలు: 4 వెల : రూ.7



## ఉపాధి ఏపీవో అవినీతి లెక్కలు..

# తేల్చేది ఎప్పుడు?

* ఎంక్వయిరీకి ముహూర్తం చూస్తున్న ఉన్నతాధికారులు
* కాలయాపనపై వెల్లువెత్తుతున్న విమర్శలు
* ఏపీవోకి కొమ్ముకాస్తున్న కొందరు అధికారులు
* వారికి సైతం వాటాలు అందాయా అన్న అనుమానాలు
* పలు పత్రికల్లో ఆధారాలతో వెల్లడించినా పట్టించుకోని అధికారులు
* కలెక్టర్, సీఎం పేషీ దృష్టికి తీసుకువెళ్లేందుకు సిద్ధమవుతున్న పలువురు నేతలు

**సంతబొమ్మాళి, ఫిబ్రవరి 3 (వార్త):** 2014 -19 సంవత్సరంలో లబ్ధిదారులకు పెండింగ్ బిల్లులు చెల్లించకుండా 12 లక్షల 33వేల 350 రూపాయలు తనకు అనుకూలంగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ ఖాతాలకు మళ్లించిన ఉపాధి హామీ ఏపీవో పంగ నరసింహమూర్తి అవినీతి లెక్కలు తేల్చేది ఎప్పుడు అంటూ లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే సంతబొమ్మాళి మండలంలోని 18 పంచాయతీల్లో సంతబొమ్మాలి, ఆర్ హెచ్ పురం, దండు గోపాలపురం, వడ్డీ తాండ్ర, చెట్ల తాండ్ర, ఆరికవలస, తాళ్లవలస, పాలతలగం, బోరుభద్ర, మలగం, కొల్లిపాడు, కోటపాడు, మేఘవరం, లక్కీ వలస, లింగూడు, కాపు గోదాయవలస, నరసాపురం, గోవిందపురం పంచాయతీల్లో పెండింగ్ బిల్లులు ఎన్టీఆర్ స్వగృహ, మినీ గోకులం, ఆర్టికల్చర్, గ్రావెల్ రోడ్డు, ఏన్యు ప్లాంటేషన్ సంబంధించి పెండింగ్ బిల్లులు గత ఏడాది ఆగస్టు నెలలో 12 లక్షల 33 వేల 350 రూపాయలు లబ్ధిదారులకు చెల్లించాలని ప్రభుత్వం అందించింది. అయితే ఆ బిల్లులు లబ్ధిదారులకు చెల్లించకుండా ఏపీవో నరసింహామూర్తి తనకు అనుకూలంగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ ఖాతాలకు లక్షల రూపాయలు లబ్ధిదారులు బిల్లులను జమ చేయించారు. కాపు గోదాయవలస ఫీల్డ్ అసిస్టెంట్ అంగ ధనుంజయ భార్య మాణిక్యం ఖాతాకు మూడు లక్షల 7వేల 379 రూపాయలు, సంతబొమ్మాలి ఫీల్డ్ అసిస్టెంట్ కింజరాపు కృష్ణమూర్తి ఖాతాకు 74 వేల973 రూపాయలు, కాకరపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ ఇప్పి పుణ్యవతి ఖాతాకు 43 వేల 026 రూపాయలు, ఆకాశ లక్కవరం ఫీల్డ్ అసిస్టెంట్ భర్త పరపటి అప్పలరాజు ఖాతాకు 51వేల185 రూపాయలు, వడ్డీ తాండ్ర ఫీల్డ్ అసిస్టెంట్ కొండల వైకుంఠ రావు ఖాతాకు 13 వేల053 రూపాయలు ఇలా తమకు అనుకూలమైన ఫీల్డ్ అసిస్టెంట్ ఖాతాలకు లబ్ధిదారుల బిల్లులను ఏపీఓ నరసింహుమూర్తి జమ చేశారు. ఐదు నెలలు కావస్తున్న లబ్ధిదారులకు బిల్లులు చెల్లించలేదు. దీంతో ఈ విషయం బయటకు పొక్కడంతో ఏపీవో అవినీతిపై వరుస కథనాలు పత్రికల్లో వచ్చాయి. దీనిపై డుమ పిడి స్పందించి టెక్కలి ఏపిడి పి.శైలజకు విచారణ చేయవలసిందిగా ఆదేశించారు. రోజులు గడుస్తున్నా విచారణ మాత్రం జరగలేదు. ఏపీడి శైలజ విచారణ చేయకుండా కాలయాపన చేస్తూ అవినీతికి పాల్పడిన ఉపాధి ఏపీఓ నరసింహామూర్తికి కొమ్ము కాయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. అవినీతిపై పత్రికల్లో కథనాలు వచ్చిన, ఉన్నతాధికారులు ఆదేశించిన విచారణకు వెనకడుగు వేయడంపై ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారుల నుండి తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. సుమారు 200 మంది లబ్ధిదారులు వద్దకు వెళ్లి విచారణ చేపడితే అసలు విషయం తెలుస్తుందని అంటున్నారు. విచారణలో న్యాయం జరగకపోతే జిల్లా కలెక్టర్‌తో పాటు సీఎం పేషీకి ఫిర్యాదు చేస్తామని పలువురు లబ్ధిదారులతో పాటు అధికార పార్టీ నేతలు అంటున్నారు.

## ఆదిత్యుని హుండీ ఆదాయం రూ.కోటికిపైనే



**అరసవల్లి, ఫిబ్రవరి 3 (వార్త):** అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో ఉన్న 19 హుండీల్లో 17 హుండీల ఆదాయాన్ని మంగళవారం ఆలయ సిబ్బంది లెక్కించారు. 60 రోజులకు గాను నోట్లు, చిల్లర ద్వారా మొత్తం రూ.1,01,65,500, బంగారం 30 గ్రాములు, వెండి 1 కేజీ 700 గ్రాములు ఆదాయం వచ్చిందని ఈవో ప్రసాద్ తెలిపారు. మరో రెండు హుండీలను బుధవారం ఉదయం ఎనిమిది గంటలకు లెక్కిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రథసప్తమి ఉత్సవ చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ కె.శోభారాణి, ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, రావివలస ఎండలమల్లికార్జున స్వామి ఆలయ ఈవో గురునాధరావు, శ్రీకాకుళం ఉమారుద్రకోటేశ్వర స్వామి ఆలయ ఈవో సుకన్య, ఆలయ సిబ్బంది, సేవాదళ్ సిబ్బంది పాల్గొన్నారు.

## యూరియా కొరతతో రైతుల అవస్థలు

3లో

* బుడితి పీఏసీఎస్ వద్ద గంటల తరబడి నిరీక్షణ



## శ్రీముఖలింగేశ్వరుని ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

* ఈనెల 15 నుంచి 18 వరకు మహాశివరాత్రి వేడుకలు
* భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడండి
* సంబంధిత అధికారులను ఆదేశించిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**శ్రీకాకుళం, ఫిబ్రవరి3(వార్త):** శ్రీముఖలింగ క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తితో కలిసి ఆయన ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జలుమూరు మండలం శ్రీముఖలింగంలో ఈనెల 15 నుంచి 18 వరకు నాలుగు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయని, చివరి రోజు చక్ర తీర్థ స్నానాలు మధ్యాహ్నం 12 గంటల నుంచి నిర్వహిస్తామన్నారు. గతంలో జరిగిన లోపాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి ఏర్పాట్లు పక్కాగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. భక్తుల దర్శనానికి సంబంధించి క్యూలైన్లు, బారికేడ్ల ఏర్పాటులో ఎక్కడా జాప్యం జరగకూడదని సూచించారు. వంశధార నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు వీలుగా తగినంత నీటి నిల్వ ఉంచాలన్నారు. తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, జనరేటర్ల సౌకర్యం ఉండాలన్నారు. విద్యుత్ వైరింగ్‌ను ముందే తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉత్సవాల సమయంలో పారిశుధ్యం ప్రధాన సమస్యగా మారకుండా తగినంత మంది కార్మికులను నియమించాలని జిల్లా పంచాయతీ అధికారికి కలెక్టర్ సూచించారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. అత్యవసర వైద్య సేవల కోసం 104, 108 వాహనాలను సిద్ధంగా ఉంచాలని, ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ.. చక్రతీర్థ స్నానాల రోజు భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఎస్పీ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. క్షేత్ర పరిసరాల్లో సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేస్తున్నామని, నదిలో గజ ఈతగాళ్లను నియమిస్తున్నామని చెప్పారు. భారీ సంఖ్యలో పోలీసు బలగాలను మోహరిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ లక్ష్మణామూర్తి, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్, ఆలయ ఈవో ఏడుకొండలు, డీపీఓ భారతి సౌజన్య, ఇన్చార్జి ఆర్డీవో జయదేవి, ఆర్ అండ్ బి ఎస్ఈ సత్యనారాయణ సత్యనారాయణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అనిత, ఫైర్ ఆఫీసర్ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.






# ఆ ప్రాజెక్టులు.. ఈ ఫిబ్రవరిలోనే!

* త్వరలో కార్గిల్ పార్క్ సుందరీకరణ పనులు పూర్తి
* పొందూరు ఖాదీపై విస్తృత ప్రచారానికి కార్యాచరణ
* సీఎస్ఆర్ నిధులతో శ్రీకూర్మం అభివృద్ధి పనులు
* కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు
* జిల్లాలో కీలక ప్రాజెక్టుల స్థితిగతులపై మంత్రి సమీక్ష

**శ్రీకాకుళం, ఫిబ్రవరి3(వార్త):** శ్రీకాకుళం పార్లమెంట్ పరిధిలోని అనేక కీలక ప్రాజెక్టులకు ఈ ఫిబ్రవరి నెలలోగా పూర్తి చేసి అందివ్వాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు జిల్లా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కేంద్ర మంత్రిగా బాధ్యత తీసుకున్న తరువాత ప్రతీ మంగళవారం పార్లమెంట్ పరిధిలోని పనుల పురోగతిపై సమీక్షను నిర్వహించడం ఆనవాయితీగా మార్చుకున్న రామ్మోహన్ నాయుడు.. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో వర్చువల్ విధానంలో క్షేత్ర స్థాయి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. శ్రీకాకుళం పార్లమెంట్ పరిధిలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రస్తుత స్థితిని, భవిష్యత్ కార్యాచరణను.. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లు రామ్మోహన్ నాయుడుకు వివరించారు. ఇందులో పలు సూచనలు చేసిన రామ్మోహన్ నాయుడు.. కొన్ని కీలక ప్రాజెక్టులను ఈ ఫిబ్రవరిలో ప్రారంభోత్సవం, శంకుస్థాపన చెయ్యాలని ఆదేశించారు. పలాస-కాశీబుగ్గ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ఏప్రిల్‌లోగా పనుల పూర్తి చేయాలన్నారు. పొందూరు ఖాదీకి పూర్వ వైభవం వచ్చేలా.. మరింత ప్రచారం అవసరమన్నారు. అందుబాటులో ఉన్న ప్రతీ వనరు వినియోగించుకుని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. శ్రీకాకుళం నగరంలో పలు పార్కులు, రోడ్ల నిర్మాణ స్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్గిల్ పార్క్‌ను త్వరితగతిన సుందరీకరించి.. మరో రెండు వారాల్లో ప్రారంభించేలా పనులు వేగవంతం చెయ్యాలని ఆదేశించారు. పెద్దపాడు రోడ్డు పనుల స్థితిని అడిగి తెలుసుకున్నారు. శ్రీకాకుళం నగర వాసులకు మరింత ఆహ్లాదాన్ని చేరువ చేసేవిధంగా నగరం నుండి సముద్ర తీరానికి ఎనిమిది కిలోమీటర్ల వ్యవధిలో వంద అడుగుల రహదారిని అందుబాటులోకి తీసుకురావాలని, ఇందుకు సంబంధించి పూర్తి ప్రాజెక్ట్ రిపోర్టును, రోడ్ల కూర్పును సిద్ధం చేయాలని మంత్రి రామ్మోహన్ అధికారులను ఆదేశించారు. ఈ రోడ్డు ఏర్పాటు ద్వారా.. తక్కువ సమయంలోనే సముద్ర తీరానికి చేరుకోవడం ద్వారా.. పట్టణ వాసులకు మరింత ఆహ్లాదాన్ని చేరువ చేయవచ్చన్నారు. బారువ సముద్ర తీరంలో పర్యాటక కేంద్రం అభివృద్ధి చేయాలని సూచించారు. జిల్లాలో నిర్మితం అవుతున్న మూలపేట పోర్టు పనుల్లో జాప్యానికి గురవుతున్న 330 ఎకరాల సాల్ట్ ల్యాండ్ సమస్యను సమీక్షలో ప్రధానంగా చర్చించారు. తన వద్ద ఉన్న పరిష్కార మార్గాన్ని కలెక్టర్, జేసిలతో చర్చించి.. సమస్యను చక్కబెట్టారు. ఈ నేపథ్యంలో గుదిబండగా మారిన సాల్ట్ ల్యాండ్ సమస్యఎట్టకేలకు పరిష్కారం కానుంది. తద్వారా.. మరింత వేగంగా మూల పేట పోర్టు పనులు ముగింపు దిశగా చేరుకోనున్నాయి.



## జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలో శ్రీకాకుళం జిల్లాకి పతకాలు

**పలాస, ఫిబ్రవరి 3(వార్త):** తమిళనాడులో జనవరి 31 నుంచి ఈనెల 2 వరకు జరిగిన జాతీయ స్పీడ్ స్కేటింగ్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా క్రీడకారులకు పలు విభాగాల్లో పతకాలు లభించాయి. పలాసకి చెందిన అండర్-8 బాలికల విభాగంలో జక్కల తోషినీ రాయ్ 200 మీటర్‌లో బంగారు పతకం, అండర్ -8 బాలుర విభాగంలో నారాయణశెట్టి పార్థసాయి కాంస్య పతకం, అట్టాడ అయాన్‌కి రజత పతకం, ఇచ్ఛాపురంనకు చెందిన అండర్ -10 బాలుర విభాగంలో సురి మహీంద్రాకి రజత పతకం, అండర్-14 విభాగంలో అల్ల సంతోష్ దొరకి రజత పతకం, అండర్ -4 బాలుర విభాగంలో నరసన్నపేటకి చెందిన ముద్దాడ లలిత్ సాయి సూర్యకి బంగారు పతకం, అండర్ 16 బాలుర విభాగంలో పలాసకి చెందిన ఇప్పిలి శివశంకరకి బంగారు పతకం సాధిం చారు. వీరిని జిల్లా స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, రాష్ట్ర కార్యదర్శి జి.ప్రతాప్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు అభినందించారు.



# రైతుకు భూ హక్కు కల్పించడమే కూటమి లక్ష్యం





**సరుబుజ్జిలి, జనవరి 3(వార్త):** లొద్దల కాగితాపల్లి గ్రామంలో భూమి యాజమాన్యపు హక్కులు కల్పిస్తూ పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆముదాలవలస శాసనసభ్యుడు, రాష్ట్ర పియుసి చైర్మన్ కూన రవికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని అర్హులైన రైతులకు భూమి యాజమాన్యపు హక్కు పత్రాలు, పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుకు భూమిపై స్పష్టమైన హక్కు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అన్నారు. భూమి సంబంధిత సమస్యలతో సంవత్సరాల తరబడి రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులకు ఈ పట్టాదారు పాస్ పుస్తకాలు శాశ్వత పరిష్కారమవుతాయని స్పష్టం చేశారు. రైతు చేతిలో పాస్ పుస్తకం ఉంటే బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాలు సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. గత వైకాపా ప్రభుత్వంలో భూ సర్వే సరిగ్గా జరగకపోవడంతో భూ వివాదాలు, రికార్డుల లోపాలతో అనేక మంది రైతులు నష్టపోయారని, వాటిని సరిదిద్దే దిశగా కూటమి ప్రభుత్వం పారదర్శకంగా చర్యలు తీసుకుంటోందని చెప్పారు. భూమి హక్కులు కేవలం పత్రాలు కాదు.. రైతుకు భరోసా, భవిష్యత్తుకు భద్రత అని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ శివాల సూర్యం, మండల అధ్యక్షులు అంబాల రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి గురువు తిరుమలరావు, మండల తెలుగు యువత అధ్యక్షులు దవల సింహాచలం, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు ఇల్లాకుల ప్రభాకర్, కె.రవికుమార్, జనసేన పార్టీ అధ్యక్షులు పైడి మురళీమోహన్, సర్పంచ్ మునకాల సూర్యారావు, కె కోటేశ్వరరావు, కె గణపతి, వెలమల రమేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శతశాతం ఉత్తీర్ణత సాధించాలి : డీఈవో



**జి.సిగడాం, ఫిబ్రవరి 3(వార్త):** పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాదించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో ఏ రవిబాబు అన్నారు. మంగళవారం దేవరవలస ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. సీ డీ గ్రేడ్లో ఉన్న విద్యార్థులను ఏ, బీ గ్రేడ్లకు తీసుకురావాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. వంద రోజుల ప్రణాళికను దృష్టిలో పెట్టుకొని పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులపై విద్యా ప్రగతిపై దృష్టి సారించాలన్నారు. అనంతరం మద్యాహ్నం భోజన వంటకాలను, పాఠశాలకు సంబంధించిన పలు రికార్డులను ఆయన పరిశీలించారు. విద్యార్థుల ప్రగతిపై ఆరా తీసారు. ఈయన వెంట అధనపు మండల విద్యాశాఖాధికారి ముళ్ల శ్రీనివాసరావు, హెచ్ఎం,డి.గోవిందరావు ఉపాధ్యాయులు ఉన్నారు.

## భక్తి శ్రద్ధలతో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు



**జి.సిగడాం, ఫిబ్రవరి 3(వార్త):** పెంట గ్రామంలో గ్రామ నీటి సంఘ అధ్యక్షురాలు మీసాల విజయమ్మ, మక్కనారాయణరావు దంపతలు, నాయుడు కుటుంబ సభ్యులు, వారితో పాటు అదిక సంఖ్యలో మహిళా భక్తులు గ్రామ దేవత చెవిటి పోమ్మ, బండర్లమ్మ, కనకదుర్గమ్మ అమ్మవారులను మంగళవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ముర్రాటలతో అమ్మవారిలకు చల్లదనం చేశారు. అమ్మవారికి పసుపు కుంకుమ, కోళ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

## వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటించాలి



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 3(వార్త):** కేశుపురం-నీలపుపుట్టుగలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో "పొలం పిలుస్తుంది"కార్యక్రమంలో భాగంగా రాగి, మినుములు, నువ్వులు పంటలపై క్లస్టర్ డెమోన్స్ట్రేషన్ నిర్వహించి, ఆధునిక సాగు పద్ధతులు, మెరుగైన విత్తనాల వినియోగం, ఎరువుల సమతుల్య వినియోగం, తెగుళ్లు-రోగాల నియంత్రణ పద్ధతులపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అజయ్‌కుమార్, దక్కత కామేశ్వరరావు, ఏపీ ప్రభుత్వ నాటక అకాడమీ డైరెక్టర్ లోహిత్, దక్కత ధర్మరాజు, ఎన్.హరికృష్ణ, జానకరావు, యశోద, మోహన్, బాలరాజు, తుసయ్య, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 3(వార్త):** వెచ్చా జయంతి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగముగా ఇచ్ఛాపురం ఎఫ్‌సిసి రెడ్ సోంపేట వారియర్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొగా 20 ఓవర్ లలో 94 పరుగులకి అలౌట్ కాగా ఇచ్ఛాపురం ఎఫ్ సి సి రెడ్ షాను 3వికెట్లుతీసుకొనిఅనంతరం 17 ఓవర్లలో 72 పరుగులకి అల్ ఔట్ అయ్యింది. ప్రేమ్ 4 వికెట్ల తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచారు. వెచ్చా కేశవరావు బత్తిన కృష్ణయ్య, కాళ్ళ దిలీప్ యాదవ్, షేక్ మున్న ఆధ్వర్యంలో జగిన మ్యాచ్ లో అంపైర్లుగా జయ, మన్మద వ్యవహరించారు.

## ప్లాస్టిక్ వినియోగం నిషేధించాలి

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 3(వార్త):** ఇచ్ఛాపురంలోని వి.జే. గ్రాండ్ ఫంక్షన్ హాల్ మన జె సి ఐ ఇండియా జాతీయ అధ్యక్షులు భరత్ ఎన్. ఆచార్య 37వ జన్మదినం సందర్భంగా తొలి సామాజిక సేవా కార్యక్రమమైన "సిప్పింగ్" ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రోజువారీ కూలీలకు స్టీల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేసి, సురక్షితమైన మరియు స్థిరమైన త్రాగునీటి అలవాట్లపై అవగాహన కల్పించారు. అదేవిధంగా, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు మరియు క్యాన్సర్‌తో ఉన్న సంబంధంపై ప్రేరణాత్మక అవగాహన ప్రసంగం నిర్వహించి, పర్యావరణహితమైన మరియు ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమానికి ఇచ్ఛాపురం అధ్యక్షులు శ్రవణ్ బోయినా , ఆయన తల్లిదండ్రులు ఉదారంగా విరాళం అందించారు. ఈ కార్యక్రమాన్ని ప్రాజెక్ట్ చైర్మన్ బోయినా వర ప్రసాద్ విజయవంతంగా నిర్వహించగా, సెక్రటరీ సంతోష్ సాహు, వేచ్చా రాము డైరెక్టర్ రాజ్‌కమల్ పాల్గొన్నారు.



# హడలెత్తిస్తున్న ధరలు..!

### - ఆందోళనలో బోర్‌వెల్ వాహన యజమానులు

### -నిరసనగా వాహనాల నిలిపివేత



**సోంపేట ఫిబ్రవరి 3(వార్త):** బోరు బావుల తవ్వకాల్లో ఉపయోగించే స్టోన్ కటింగ్ బిట్ ధరలు ఒక్కసారిగా ఆకాశానికి ఎగబాకాయి. ఒక్క నెల రోజుల వ్యవధిలోనే వాటి ధరలు రెట్టింపు కావడంతో ఏమి చేయాలో తెలియని పరిస్థితుల్లో బోరు బావుల వాహన యజమానులు గత్యంతరం లేక నిరసనగా వాహనాలను నిలిపివేస్తూ ఆందోళన బాట పట్టారు. ఈ మేరకు ఇచ్ఛాపురం నుంచి పలాస వరకు పనిచేస్తున్న బోర్వెల్ వాహన యజమానులంతా ఏకమై సోంపేట శివారుణ బిరుసువాడ ప్రాంతంలో లారీలన్నీ ఒక దగ్గర పెట్టి యజమానులు నిరసనగా అక్కడే కూర్చుంటున్నారు. ఈ మేరకు వారు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ గతంలో 23 వేల రూపాయలు ఉన్న స్టోన్ కటింగ్ బిట్ ప్రస్తుతం 56 వేల రూపాయలకు చేరిందని ఇది ఇంకా రోజురోజుకు పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ఒక్కసారిగా ధరలు పెంచలేక బోర్లు వేయలేక తీవ్రంగా సతమతమవుతూ పనులు నిలుపుదల చేశామని పేర్కొన్నారు. ఇప్పటివరకు బోర్ల త్రవ్వకాల్లో అనుసరించిన ధరలు పెరిగిన పరికరాల ధరలతో తట్టుకోలేని పరిస్థితి ఎదురైందని ఆవేదన వ్యక్తం చేశారు. బోరు బావుల తవ్వకాల యజమానులకు ఇప్పటి పరిస్థితుల్లో ఎంత మాత్రం గిట్టుబాటు కాదని పేర్కొంటున్నారు. దీనిపై అన్ని రాష్ట్రాల్లోనూ ఆందోళన వ్యక్తం అవుతుందని అన్నారు. అని ప్రాంతాల్లోనూ వాహనాలు నిలుపుదల చేయడంతో బోరు బావులు పనులు కూడా ఆగిపోయాయని అనేకచోట్ల నిర్మాణదారులు కూడా ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ప్రతి ప్రాంతంలోనూ యూనియన్ గా ఏర్పడి ఇదే అంశంపై చర్చించడం జరుగుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దీనిపై ప్రధానంగా దృష్టి సారించి ధరలు తగ్గిస్తే తప్ప సామాన్యులకు బోర్ల నిర్మాణం తీవ్రమైన భారంగా మారుతుందని పేర్కొన్నారు. స్టోన్ కటింగ్ వంటి బిట్లు ధరలు తగ్గించే వరకు నామమాత్రంగా పెంచేందుకు ఆలోచన చేస్తున్నామని అన్నారు. తమకు ఎదురైన ఈ పరిస్థితిని ప్రజలు అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం జరిగిన వాహన యజమానుల సమావేశంలో అధ్యక్షులు బత్తుల బాబురావు, చెల్లూరు ధర్మారావు పిరియా జోగారావు మద్ది భార్గవ్ సిహెచ్ గౌరీ జయ మహంతి బి సంతోష్ రంగా తదితరులు పాల్గొన్నారు.



# భూసార పరీక్షలు రైతులకు వరం

**కంచిలి ఫిబ్రవరి 3(వార్త):** భూసార పరీక్షలు చేయించుకోవడం రైతులకు ఎంతో ప్రయోజనకరమని వ్యవసాయ సహాయ సంచాలకులు టి భవాని శంకర్రావు కంచిలి వ్యవసాయ అధికారి సురేష్ కుమార్ పేర్కొన్నారు. కంచిలి మండలం కేసరి పద రైతు సేవా కేంద్రం పరిధిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం లో భాగంగా భూసార పరీక్షలు యొక్క ఉపయోగాలు మట్టి నమూనాల సేకరణ ఈ పంట యొక్క ఉపయోగాలు వివరించారు. 2025-26 సంవత్సర కాలానికి మట్టి నమూనాల సేకరణ లక్ష్యం 1696గా నిర్ణయించినట్లు తెలిపారు. ముందుగా నిర్ణయించిన రైతుల పొలాల్లో సేకరించిన నమూనాలను ఆముదాలవలస మట్టి పరీక్ష కేంద్రానికి పంపించి భూసార పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. రైతులు పండించే పంటలను మొబైల్ లో గల ఈ పంట యాప్ లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఏపీఏఐఎంఎస్ అనే రైతు యాప్ డౌన్లోడ్ చేసుకొని తద్వారా వ్యవసాయ సమగ్ర సమాచారాన్ని రైతులు పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మాస్టర్ ట్రైనర్ శివానందం, విఏఏ సంగీత రైతులు పాల్గొన్నారు.



# రైతులకు రాయితీ విత్తనాల పంపిణీ

**కొత్తూరు, జనవరి 3 (వార్త):** కొత్తూరు మండలంలోని 'ఆదివాసి రైతు ప్రగతి' ఎఫ్‌పీవో కీలక అడుగు వేసింది. సాంప్రదాయ పంటల సాగును ప్రోత్సహించడం మరియు గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధిని కాంక్షిస్తూ అడ్డంగి గ్రామం కేంద్రంగా 533 మంది సభ్యులతో కొనసాగుతున్న ఈ రైతు ఉత్పత్తిదారుల సంఘం కృషి ఫలితంగా, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ ద్వారా రాయితీపై నువ్వుల విత్తనాలు మంజూరయ్యాయి. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారుల సమక్షంలో వీటిని రైతులకు పంపిణీ చేశారు. గత కొంతకాలంగా జిల్లాలో నువ్వులు, వేరుశనగ వంటి నూనెగింజల సాగు విస్తీర్ణం తగ్గుతుండటంతో, ఫ్రీూా ప్రతినిధులు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి గిరిజన రైతులను ప్రోత్సహించాలని కోరారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం, ముఖ్యంగా ఆదివాసి మరియు వెనుకబడిన తరగతికి చెందిన చిన్న, సన్నకారు రైతుల కోసం 500 ఎకరాలకు సరిపడా నువ్వుల విత్తనాలను మంజూరు చేసింది. ఈ విత్తనాలను గొట్టిపల్లి, అల్తీ, ఇరపాడు, ఇరపాడుగుడ, కారిగూడ, కార్లెమ్మ, కొత్తూరు గ్రామాలకు చెందిన రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, రైతులు శాస్త్రీయ పద్ధతులను పాటించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో కొత్తూరు ఏడీఏ రాజగోపాల్, ఏఓ సుమంత్, ఫ్రీూా అధ్యక్షులు సవర నాగేశ్వరరావు, ఏరియా వెలుగు అసోసియేషన్ కోఆర్డినేటర్ సవర ఆనందరావు, సర్పంచులు నిమ్మక రామకృష్ణ, సవర పాల్గొనరావు , పెద్ద సంఖ్యలో లబ్ధిదారులైన రైతులు పాల్గొన్నారు.



## ఉత్తమ అవార్డు గ్రహీతకు సన్మానం



**సంతబొమ్మాళి, ఫిబ్రవరి 3(వార్త):** నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్ నర్స్ గా విధులు నిర్వహిస్తున్న పరపటి ధనలక్ష్మి కు శ్రీకాకుళం పట్టణంలో ఆర్ట్స్ కాలేజ్ మైదానంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా జనవరి 26న జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆధ్వర్యంలో డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ కె అనిత చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకున్నారు. దీంతో మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీహెచ్సీ వైద్యాధికారిణి డాక్టర్ పరిమళ ఆధ్వర్యంలో సిబ్బంది ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. జిల్లాలో ఉత్తమ స్టాఫ్ నర్స్ గా జిల్లా వైద్యాధికారి చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకోవడం గర్వకారణంగా ఉందని స్టాఫ్ నర్స్ ధనలక్ష్మి అన్నారు. ఈ ప్రతిభ ప్రశంస పత్రం అందుకోవడం వెనుక వైద్యాధికారిణి డాక్టర్ పరిమళ, సిబ్బంది కృషి, ఆసుపత్రికి వచ్చిన రోగులు ఆధార్ కార్డు తెచ్చి సహకరించడం ఉందన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ ఎంవి గోవిందరావు , పీహెచ్ఎన్ రాజేశ్వరి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎడ్యుకేషనల్ ఎఫిషియెన్సీ పరీక్షలో కంబకాయ జడ్పీ విద్యార్థి ప్రతిభ



**నరసన్నపేట, ఫిబ్రవరి 3(వార్త):** నరసన్నపేట మండల స్థాయిలో ఇటీవల నిర్వహించిన ఎడ్యుకేషనల్ ఎఫిషియెన్సీ మోడల్ టెస్ట్ పరీక్షల్లో కంబకాయ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థి పొన్నాడ సూర్య ప్రథమ స్థానం సాధించి తన ప్రతిభను చాటుకున్నాడు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు (హెచ్ఎం) బమ్మిడి మాధవరావు విద్యార్థి సూర్యను అభినందిస్తూ రూ.1,000ల బహుమతి, సర్టిఫికెట్, షీల్డ్‌ను అందజేశారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు విద్యార్థి పొన్నాడ సూర్యను అభినందిస్తూ, ఇతర విద్యార్థులకు ఆయన ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. విద్యలో కృషి, నిబద్ధత ఉంటే ఉన్నత ఫలితాలు సాధించవచ్చని వారు అన్నారు.

## వీధి లైట్లు పునరుద్ధరణ

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 3(వార్త):** బాలకృష్ణాపురం పంచాయతీలో వీధి లైట్లు పునరుద్ధరించారు.గత కొన్ని రోజులుగా వీధి లైట్లు వెలగక అంధకారంలో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సర్పంచ్ ప్రతినిధి బోరుభద్ర లోహి దాస్ వీధి లైట్లు వెలిగించారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం

## కిడ్నీ బాధితుడికి రూ.20,000ల ఆర్థికసాయం

**సంతబొమ్మాళి, ఫిబ్రవరి 3(వార్త):** నౌపడ గ్రామం కు చెందిన తామాడ ప్రసాద్ బాబు అనే వ్యక్తి రెండు కిడ్నీలు చెడిపోయి వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ విషయం తెలుసుకున్న సున్నా పల్లి గ్రామస్తులు అందరూ డబ్బులు వేసుకుని బాధిత కుటుంబానికి రూ. 20,000 ఆర్థిక సాయం అందజేశారు.

ఈ కార్యక్రమంలో సుగ్గు చిన్నమ్మ,జానపన దేవి, నక్క నీరజ తదితరులు పాల్గొన్నారు.



# రేషన్‌లో తరుగు వస్తే సహించేది లేదు



### -అదనపు ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్

**జి.సిగడాం, ఫిబ్రవరి 3 (వార్త):** రేషన్ దుకాణాలకు పంపిణీ చేసే రేషన్ సరుకుల్లో తరుగుదల వస్తే సహించేది లేదని డోనాక పృథ్వీరాజ్ కుమార్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఎఫ్‌సీ గొడౌన్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో రేషన్ దుకాణాలకు సక్రమంగా రేషన్ సరుకులు అందించాలన్నారు. గడువులోపు రేషన్ సరుకులు ఆయా దుకాణాలకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. అవకతవకలకు పాల్పడితే శాఖ పరమైన కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సరుకుల పంపిణీలో తేడాలు, తరుగు వంటి విషయాలు తమ దృ ష్టికి వస్తే శాఖా పరమైన చర్యలు తప్పవన్నారు. అనంతరం డీఆర్ వలస గ్రామ సచివాలయాన్ని పరిశీలించారు. సమయంపాలన పాటించి, అంకితభావంతో పనిచేయాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈయన వెంట తహసీల్దార్ ఎం.సరిత, సీఎస్ డీటీ తిరుపతిరావు, రీసర్వే డీటీ కె.గాయత్రి, ఆర్ఐ ఎ.రాధ, మండల సర్వేయర్ శాంతారాం, వీఆర్వో తదితరులు ఉన్నారు.

## లడ్డూ కల్తీ దుష్ప్రచారంపై చర్యలు తీసుకోండి

### -నరసన్నపేట పోలీస్‌స్టేషన్‌లో వైసీపీ నాయకుల ఫిర్యాదు



**నరసన్నపేట, ఫిబ్రవరి 3(వార్త):** తిరుమల లడ్డూలో కల్తీ జరిగిందంటూ అనుచిత వ్యాఖ్యలు చేస్తూ దుష్ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ నియోజకవర్గ వైసీపీ నాయకులు మంగళవారం నరసన్నపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ ఆరంగి మురళీధర్ ఆధ్వర్యం వహించారు. ఫిర్యాదు అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో వైసీపీ నాయకులు మీడియాతో మాట్లాడారు. తిరుమల లడ్డూలో కల్తీ జరగలేదని సిట్ దర్యాప్తులో స్పష్టమైన నివేదిక వచ్చినప్పటికీ, కూటమి నేతలు ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని వారు ఆరోపించారు. ఇటువంటి వ్యాఖ్యలు భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని పేర్కొన్నారు. సిట్ నివేదికను గౌరవించకుండా అసత్య ప్రచారం కొనసాగిస్తే ప్రజల్లో గందరగోళం ఏర్పడే ప్రమాదం ఉందని, అందువల్ల బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైసీపీ నాయకులు పోలీసులను కోరారు. ప్రజల శాంతి భద్రతలు, సామాజిక సమతుల్యతను కాపాడేందుకు పోలీసులు తగిన చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు.

## నైపుణ్యంతోనే ఆర్థికాభివృద్ధి



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 3 (వార్త):** నిరుద్యోగ యువత కేవలం ఉద్యోగాల కోసమే వేచి చూడకుండా, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకుని స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంస్థ కార్యనిర్వాహక సంచాలకులు కె. వినాయకం పిలుపునిచ్చారు. భారీ వాహనాల డ్రైవింగ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 10 మంది ఎస్సీ యువతకు మంగళవారం ఆయన లైసెన్సులు, ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ఎస్సీ సహకార ఆర్థిక సంస్థ ఆదేశాల మేరకు జిల్లాలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఈ శిక్షణ ఇచ్చామన్నారు. రవాణా రంగంలో సుశిక్షితులైన డ్రైవర్లకు మంచి అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రోత్సాహంతో దళిత యువత ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం అమరసింహుడు, మోటార్ వాహనాల ఇన్‌స్పెక్టర్ గంగాధర్, సంస్థ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## వలకు చిక్కుకుని తాబేళ్లు మృతి



**శ్రీకాకుళం, ఫిబ్రవరి3(వార్త):** ఎచ్చెర్ల మండలం, పాతదిబ్బలపాలెం సముద్రతీర ప్రాంతంలో తాబేళ్లు ఎక్కువగా మృత్యువాత పడటానికి మత్స్యకారులు వాడుతున్న వలలే ప్రధాన కారణమని పొన్నాడ వెటర్నరీ అసిస్టెంట్ సాయి ప్రసాద్ తెలిపారు. స్కిడ్ నెట్, నానా జాతి వలలు, గిల్లెట్ నెట్, టేకు వలల బారిన పడి తాబేళ్లు మృతి చెందుతున్నాయన్నారు. శ్రీకాకుళం అటవీ పరిధి అధికారి, సిబ్బంది నిర్వహించిన విచారణలో గుర్తించారు. విశాఖపట్నం నుండి వచ్చే మెకానైజ్డ్ బోట్స్ వలన కూడా తాబేళ్ల మృత్యువాత పడుతున్నాయని గుర్తించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు అటవీ శాఖ, ఫిషరీస్ శాఖ, మెరైన్ విభాగం, ట్రీ ఫౌండేషన్, స్థానిక మత్స్యకారులతో కలిసి అవగాహన సదస్సులు నిర్వహించాల్సిన అవసరముందని చర్చించారు. ఈ చర్చల్లో అటవీ శాఖ అధికారి ఆర్.రాజశేఖర్, ఫారెస్టు సెక్షన్ అధికారి ఆర్.వినోద్ కుమార్, ట్రీ ఫౌండేషన్ ప్రతినిధులు, శ్రీకాకుళం అటవీ పరిధి సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్నారుల కంటికి.. ప్రభుత్వ రక్ష

* నేత్ర సమస్యలపై అవగాహన అవసరం
* ఎమ్మెల్యే గొండు శంకర్



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 3 (వార్త):** పాఠశాల విద్యార్థులు చిన్న వయసులోనే కంటి సమస్యల పట్ల అవగాహన కలిగి ఉండాలని, దృష్టి లోపాలను ఆదిలోనే గుర్తిస్తే మెరుగైన వైద్యసేవలు అందించవచ్చని శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ అన్నారు. మంగళవారం స్థానిక ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన కంటి పరీక్షల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువులో వెనుకబడకుండా ఉండాలంటే కంటి చూపు ప్రధానమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ఉచిత వైద్య సదుపాయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం 'విద్యార్థులను చేర్పించండి – వారి తలరాతలు మార్చండి' అనే గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమ వివరాలను జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ ఎస్.పుష్పలత వెల్లడించారు. జిల్లాలోని 30 మండలాల్లో గల 855 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 1.08 లక్షల మంది విద్యార్థులకు స్క్రీనింగ్ పూర్తి చేసినట్లు తెలిపారు. 18 ప్రత్యేక బృందాల ద్వారా నిర్వహించిన ఈ పరీక్షల్లో 5,595 మందికి దృష్టి లోపాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ ప్రక్రియలో 1,082 మంది ఉపాధ్యాయులకు ముందస్తుగా శిక్షణ ఇవ్వడం వల్ల క్షేత్రస్థాయిలో పరీక్షలు వేగంగా సాగాయని వివరించారు. దృష్టి లోపాలు ఉన్నట్లు తేలిన 5,550 మంది విద్యార్థులకు ఈ నెలాఖరులోగా ఉచితంగా నాణ్యమైన కళ్లద్దాలను పంపిణీ చేస్తామని జిల్లా ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె. అనిత తెలిపారు. తీవ్ర సమస్యలు ఉండి శస్త్రచికిత్స అవసరమైన 11 మంది విద్యార్థులకు 'ఎన్టీఆర్ వైద్య సేవ' ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎం.ఈ.ఓలు ఎన్.కృష్ణ, సుజాత, అర్బన్ మెడికల్ ఆఫీసర్ ప్రత్యూష, ప్రధానోపాధ్యాయులు డి.ఎస్.వి. భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నువ్వుల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి



**నరసన్నపేట, ఫిబ్రవరి 3(వార్త):** నువ్వు పంట సాగులో రైతులు తప్పనిసరిగా యాజమాన్య పద్ధతులను అనుసరించాలని వ్యవసాయ శాస్త్రవేత్త శ్రీ జ్యోతి బసు సూచించారు. మంగళవారం నరసన్నపేట మండలం దూకులపాడు ఆర్ఎస్‌కే పరిధిలో నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంట దిగుబడులు పెంచాలనే ఉద్దేశంతో ఎరువులను అధికంగా వినియోగించడం వల్ల నేల సారత తగ్గే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మితంగా, శాస్త్రీయంగా ఎరువుల వినియోగం చేయాలని సూచించారు. అలాగే పొలాల్లో పంట అవశేషాలను కాల్చవద్దని, వాటిని సేంద్రియ పదార్థాలుగా మార్చి నేలలో కలిపితే నేల ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. నువ్వు సాగులో సరైన విత్తన ఎంపిక, నీటి వినియోగం, కలుపు నియంత్రణ వంటి యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రాధికారి సురేశ్, ఏడీ ఎల్. వెంకట మధు, వ్యవసాయ అధికారి సూరి కుమారి పాల్గొని రైతులకు అవసరమైన సమాచారం అందించారు.

## యూరియా కొరతతో రైతుల అవస్థలు

### -బుడితి పీఏసీఎస్ వద్ద గంటల తరబడి నిరీక్షణ



**సారవకోట, ఫిబ్రవరి 3(వార్త):** రబీ సీజన్‌లో వరి సాగు విస్తీర్ణం పెరగడంతో యూరియా డిమాండ్ అధికమై, సారవకోట మండలం బుడితి పీఏసీఎస్ వద్ద రైతులు ఇబ్బందులు పడుతున్నారు. బుడితి, చీడిపూడి గ్రామాలకు సంబంధించిన రైతులు మంగళవారం ఉదయం నుంచే యూరియా కోసం పీఏసీఎస్ వద్ద పడిగాపులు కాస్తున్నారు. బుడితి పీఏసీఎస్‌కు సుమారు 200 బస్తాల యూరియా మాత్రమే సరఫరా కావడంతో రైతుల అవసరాలకు అది సరిపోవడం లేదని తెలుస్తోంది. ఈ ఏడాది రబీ సీజన్‌లో అధిక విస్తీర్ణంలో వరి సాగు చేపట్టడంతో యూరియా అవసరం గణనీయంగా పెరిగిందని రైతులు తెలిపారు. సకాలంలో సరిపడా యూరియా అందుబాటులో లేకపోవడంతో పంటలకు ఎరువుల వాడకం ఆలస్యం అవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి అదనపు యూరియా సరఫరా చేసి రైతుల ఇబ్బందులను తొలగించాలని వారు కోరుతున్నారు.

## పాడి పరిశ్రమాభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి

### జిల్లా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ సూర్యనారాయణమూర్తి

**నరసన్నపేట, ఫిబ్రవరి 3(వార్త):** పాడి పరిశ్రమ అభివృద్ధి దిశగా ప్రతి పశుసంవర్ధక శాఖ ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ సూర్యనారాయణమూర్తి ఆదేశించారు. మంగళవారం నరసన్నపేట వెటర్నరీ హాస్పిటల్‌లో పోలాకి, నరసన్నపేట ప్రాంతాలకు చెందిన పశు వైద్య సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామస్థాయిలో పర్యటిస్తూ పాడి రైతులకు ఆధునిక పద్ధతులు, పశు ఆరోగ్య సంరక్షణ, పాల ఉత్పత్తి పెంపుపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పశువుల వ్యాధుల నివారణ, సకాలంలో చికిత్స, టీకాలు వంటి అంశాలపై రైతులకు సూచనలు అందించాలని తెలిపారు. పాడి పరిశ్రమ అభివృద్ధి ద్వారా రైతుల ఆదాయం పెరుగుతుందని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ఇందుకోసం శాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## ఈఈఎంటీలో భాగ్యశ్రీకి ప్రథమస్థానం



**జలుమూరు, ఫిబ్రవరి 3(వార్త):** జలుమూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇటీవల నిర్వహించిన ఎడ్యుకేషనల్ ఎఫిషియెన్సీ మెరిట్ టెస్ట్ (ఈఈఎంటి)లో శ్రీముఖలింగం జడ్పీ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని రావాడ భాగ్యశ్రీ ప్రథమ స్థానంలో నిలిచి ప్రతిభను చాటుకుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు (హెచ్‌ఎం) శ్రీ ప్రభాకర్ మంగళవారం మాట్లాడుతూ, భాగ్యశ్రీ సాధించిన ఘనత పాఠశాలకే గర్వకారణమని పేర్కొన్నారు. ఆమెకు ప్రథమ స్థానం లభించిన సందర్భంగా నగదు బహుమతి, సర్టిఫికెట్ మరియు సీల్డ్‌ను అందజేసి అభినందనలు తెలియజేశారు. విద్యార్థిని భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరాలని, రాబోయే పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు భాగ్యశ్రీని అభినందిస్తూ, ఇతర విద్యార్థులకు ఆమె ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు.

## బంగారు ఆభరణాలతో సంచరించవద్దు

### -ఎస్సై బి.గణేష్



**నరసన్నపేట, ఫిబ్రవరి 3(వార్త):** బంగారం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో నేరస్తుల దృష్టి బంగారు ఆభరణాలపై పడుతున్నందున ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని నరసన్నపేట పోలీస్ స్టేషన్ ఎస్సై బి.గణేష్ సూచించారు. మంగళవారం మధ్యాహ్నం పోలీస్ స్టేషన్‌లో మాట్లాడిన ఆయన, విలువైన బంగారు ఆభరణాలతో ప్రధాన రహదా రులపై సంచరించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రత్యేకంగా శుభకార్యాలకు హాజరయ్యే సమయంలో, రాత్రి వేళల్లో తగిన భద్రత లేకుండా ప్రయాణించవద్దని ఎస్సై హెచ్చరించారు. ఒంటరిగా ప్రయాణించడం, జనసంచారం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో సంచరించడం వంటి సంద ర్భాల్లో నేరాలకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఆయన తెలిపారు. ఏదైనా అనుమానాస్పద ఘటనలు గమనించినా లేదా నేరం జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ఆలస్యం చేయకుండా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. ప్రజల సహకారంతోనే నేరాలను నియంత్రించగలమని పేర్కొన్న ఎస్సై గణేష్, భద్రతా నియమాలను పాటిస్తూ పోలీసులకు పూర్తి సహకారం అందించాలని కోరారు.

## మహర్షి విద్యాలయంలో 'శక్తి' గళం

**కొత్తూరు, జనవరి 3(వార్త):** మహిళలు, పిల్లల రక్షణే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా, కొత్తూరు మండల కేంద్రంలోని మహర్షి విద్యాలయంలో శక్తి యాప్ కోసం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. పోలీస్ శాఖకు చెందిన శక్తి టీమ్--4 ఆధ్వర్యంలో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శక్తి టీమ్ సభ్యులు మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో మహిళలు, విద్యార్థినులు ఎదుర్కొంటున్న సవాళ్లు, వాటిని అధిగమించే మార్గాలను వివరించారు. ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్‌లలో శక్తి యాప్‌ను ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి, ప్రమాద సమయంలో అది ఎలా రక్షణగా నిలుస్తుందో ప్రాక్టికల్‌గా వివరించారు,ఆపదలో ఉన్నప్పుడు తక్షణ సహాయం కోసం 112 నంబర్‌కు డయల్ చేయాలని సూచించారు,సోషల్ మీడియాలో అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని, ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా ఉండాలని హెచ్చరించారు. యువత మరియు విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, రోడ్డు భద్రతా నియమాలను విధిగా పాటించాలని కోరారు. "మహిళలు, పిల్లలు ఎలాంటి ఇబ్బందుల్లో ఉన్నా భయం వీడి ధైర్యంగా పోలీసులను ఆశ్రయించాలి. ఆపదలో ఉన్నవారికి అండగా ఉండేందుకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు.విద్యార్థులకు ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేస్తూ పలు సూచనలు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. రాంబాబు మాట్లాడుతూ, విద్యార్థుల భద్రత దృష్ట్యా ఇలాంటి అవగాహన సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఎం.గిరిధర్, మహిళా పోలీస్ కానిస్టేబుళ్లు కె.రమణమ్మ, జి.యమున, జీఎంఎస్కేలు నివేదిత, ఉషారాణి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546